

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు





2007 సంవత్సరం ఉత్తమ చలన చిత్ర కథా రచయిత్రిగా (మధుమాసం చిత్రానికి) - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది బహుమతిని పొందిన రమణి గారికి కౌముది హృదయపూర్వక అభినందనలు తెలియచేస్తోంది.

### బాబోయ్ ట్రాఫిక్

ఒకసారి మా డ్రైవర్ ఎల్విస్, ఇది నేను పెట్టుకున్న ముద్దు పేరు, అసలు పేరు ఎల్లయ్య. అతన్ని తీసుకొచ్చి ఈ అమెరికా వీధుల్లో నిలబెడితే.. "అమ్మో..నాకు బ్రహ్మ చెవుడు వచ్చింది. ఏ హారనూ వినిపించడం లేదు బాబోయ్... అని భయపడి మూర్ఛపోతాడు. అంతెందుకూ... "ఎల్లయ్యా అమెరికాలో ఏ కారూ హారన్ వెయ్యదు" అని చెపితే "మేడం ఐదువారాలు పరాయి దేశంలో ఉండేటప్పటికి మెంటల్ వచ్చింది పాపం హారన్ కొట్టరంట. గట్లెట్లా?" అని తన తోటి డ్రైవర్లతో చెపుతాడు.

ఈవిధమైన రోడ్లూ, ట్రాఫిక్ రూల్స్ పాటించే మనుషులూ, క్రమబద్ధంగా వెళ్ళిపోతున్న మనుషులూ ఈ నీట్‌నెస్ చూస్తుంటే నాకు, ఒక్కసారి మా అమీర్ పేట చౌరస్తా, కోటీ చౌరస్తా, మన కారుని ముద్దుపెట్టుకుంటూ వెళ్ళే లారీలూ, సైకిల్ పట్టే సందుంటే, ఆటో పెట్టేసే డ్రైవర్లూ, కారుకి అడ్డంగా పరిగెత్తుకొచ్చి మన తప్పులేకపోయినా బూతులు తిట్టే మన జనం గుర్తొచ్చారు! ఎర్రలైటు వెలిగితే ఆగిపోయే వాడ్ని చూస్తే పక్కనుంచి దూసుకుపోయేవాడికి వెర్రివెంగళాయిని చూసినట్లు ఉంటుంది. ట్రాఫిక్ పోలీస్ ఆపితే ఆ మామూలూ, గొడవా వేరే ఉంటుంది లెండి! నేను పంజగుట్టలో ఈ వైపు నుండి ఆ వైపుకి రోడ్డు దాటాలంటే నన్ను మా ఆఫీస్ బాయ్స్ నలుగురు సాయం పట్టాల్సొచ్చేది అప్పటికే నేను కళ్ళు మూసుకుని "బాబోయ్... బాబోయ్" అని ఎవరో హత్య చేస్తుంటే అరిచే హీరోయిన్‌లా అరుస్తుండేదాన్ని! ఈ రోడ్లమీద క్లార్లు నడపాలంటే వాళ్ళు సింహ బలులూ, లేదా సర్దార్ వల్లభాయి పటేల్‌లా ఉక్కుమనుషులయినా అయిఉండాలి అమెరికాలో మనిషికోకారు. కాళ్ళకి అసలే పనే లేదు!

నాకు అన్నింటికన్నా తెగ నచ్చేసింది. జి.పి.యస్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ అనే ఈ పరికరం. ఈ జీ.పి.యస్ గాడూ లేదా అదీ... కారు ఎక్కినప్పటినుండీ దారి చూపెడుతూనే ఉంటుంది. దీనికి నేను పెట్టిన ముద్దు పేరు దా.చూ.దే అంటే దారి చూపే దేవత. ఒక్క నిమిషం నోరుముయ్యకుండా వాగింది వాగినట్లే ఉంటుంది. కొంచెం అనుమానం వచ్చినా " రౌట్ రీకాలిక్యులేషన్" అంటూ అరిచి మొట్టికాయ వేసినంత పని చేస్తుంది. మనం వెళ్ళాల్సిన ఎడ్రెస్ దానిలో ఫీడ్ చేస్తే చాలు, దారి చూపిస్తూ తీసుకెళ్ళి దింపేస్తుందన్నమాట.

ఎవడికైనా సత్తా ఉంటే మన ఇండియాలో ఏ ఊరికైనా జి.పి.ఎస్ కనిపెట్టమనండి చూద్దాం! ఒకవేళ కనిపెట్టినా, హైదరాబాదుకి ఛస్తే కనిపెట్టలేరని ఢంకా బజాయించి చెప్పగలను. ఈ రోజు పార్క్ ఉన్న చోట రేపు చేపల మార్కెట్ ఉంటుంది. ఇవాళ హోటల్ ఉన్న చోట రేపు పబ్లిక్ యూరినల్స్ అంటాయి. అంతెందుకు ఎవడైనా పేరున్న వాడింట్లో ఆ రోజు ఫంక్షన్ ఉంటే రోడ్డు మూసేసి డైవర్షన్ తీసుకోవాలంటారు. గవర్నమెంటు పర్మిషన్ కూడా ఇచ్చి పారేస్తుంది. అసలు వాన వస్తేనే చచ్చినట్లు ఏవేవో దారులు వెతుక్కోవాలి. మన పేరు మీద విస్తరాకులు మిగిలి ఉంటే ఇంటికి చేరతాం. లేదా నోరు తెరుచుకుని ఎదురు చూసే మేన్‌హోల్స్‌కి ఆహుతి అవుతాం. ఇది నవ్వటానికి అనుకునే మాటకాదు. చేదు నిజం!

నాకు ఐదేళ్ళ క్రితం వెన్నులో నరం డిస్‌లొకేట్ అయి ఆపరేషన్ చెయ్యాల్సొచ్చింది. దాని అనంతరం ఆర్నెల్లు బెడ్ మీద ఉండి విద్యుత్ స్త్రీనై... అంటే క్రమం తప్పకుండా కాలికి కరెంట్ పెట్టించుకుని, ఫిజియోథెరఫీ చేయించుకుని, తిరిగి మామూలు మనిషై లేచి తిరగడం మొదలు పెట్టాను. అసలు దీనికంతటికీ కారణం ఏమిటో తెలుసా? రోడ్ల మీద గతుకులు! ఆటోలు ఎత్తెత్తి పడెయ్యడమే కారణం! ఒక రెండు లక్షలు వదిలి, ఆర్నెల్లు కాలు వస్తుందో రాదో తెలియక చిత్రహింస అనుభవించాను. మనం ఇక్కడ ఎవర్నీ ఏమీ అనలేం. అదే అమెరికాలో అయితే 'సూ' చేయొచ్చు. 'సూ' చెయ్యడం దాకా ఎందుకు? మాకు రోడ్లు వేయించండీ అని ఎవడినైనా మనం గెలిపించిన నియోజక వర్గం ప్రజాప్రతినిధిని అడగగలమా ఇండియాలో?

అమెరికాలో ఇంకో ఆకర్షణ, రెస్ట్‌రూమ్స్.. లక్షల మంది తిరిగే రోడ్ల కూడలిలో అయినా పరిశుభ్రంగా మన కాలి దుమ్ముతో మాసిపోతాయేమో అన్నట్లుగా ఉండే పబ్లిక్ యూరినల్స్! మనకీ కట్టారు సులభా కాంప్లెక్సులు కానీ శుభ్రంగా మెయింటెన్ చేయడం అంత సులభం కాదు! మన వాళ్ళంటే నాకు విపరీతమైన అభిమానమే కానీ ఈ విషయంలో వెనకేసుకురాలేను! అసలెందుకు పరిశుభ్రత పాటించరో ఎప్పటికీ అర్థం కాని మిలియన్ డాలర్స్ క్వశ్చన్. పక్కనే నీళ్ళున్నా వాడిన తరువాత పొయ్యరు. ఫ్లష్ చెయ్యడానికి బటన్ నొక్కితే చాలు. అయినా నొక్కరు. అసలు నలుగురికి ఉపయోగపడే ఏ వస్తువు అయినా మనవాళ్ళకి చులకన! అమెరికాలో చాక్లెట్ తిని రోడ్ల మీద కాయితం పారెయ్యడానికి భయం! జేబులో వేసుకొచ్చి డస్ట్‌బిన్‌లో వేస్తారు. మళ్ళీ ఇండియా రాగానే యధేచ్ఛగా పల్లీలు తిని రైలు కంపార్ట్‌మెంట్‌లో, పాన్ తిని పేవ్‌మెంట్ల మీదా ఉమ్మగలరు! అక్కడలా సెల్‌ఫోన్లూ, డిష్‌వాషర్లూ, ఐపాడ్లూ పాడూ వాడుతున్నప్పుడు అక్కడ శుభ్రత ఇక్కడ పాటించడానికేవంట?

నాకు తెలిసీ ప్రతిరాజకీయనాయకుడూ, గొప్పవాడూ, గట్టిగా దురదేస్తే చూపెట్టడానికి అమెరికా వెళతారు. అక్కడ చూసినది ఇక్కడ ఎందుకు అమలులో పెట్టరో అర్థంకాదు. మనకి రోడ్డు మేపులు లేవు! ఒకదాని మీద ఒకటి ఏడెనిమిది అంతస్తుల రోడ్లూ లేవు! ట్రాఫిక పోలీస్ అనే మనిషి లేకపోయినా, క్రమం తప్పకుండా పార్కింగ్ ఫీజు చెల్లించే ఆనవాయితీ లేదు! గంట పార్కింగ్ అనీ, గంటగడవగానే 'ధన్'మని బిల్ ఇచ్చే పద్ధతీ లేదు. హోటళ్ళకెళితే 'చెక్' ఇస్తానంటాడు సర్వర్. మనం వింటే అతనివ్వడం ఏమిటనుకునేరు, బిల్లుకి వాళ్ళ పర్యాయపదం అది! ఇవన్నీ లేకపోయినామనవాళ్ళకి గ్రహణ శక్తి ఉందిగా. అల్లూరి సీతారామరాజుగారన్నట్లు ఆ దేశాల్లో బట్ట కట్టుకోవాలని తెలియనప్పుడే మన నేత పనివాళ్ళు అద్భుతమైన చీరలు నేసిన సంస్కృతి మనది! ఏదైనా ఇట్టే చూపిస్తే, అట్టే పట్టేసే వీరులుండబట్టేగా మన దేశం మెదడు ఎండగడుతూ బ్రెయిన్ డ్రెయిన్ అయిపోతోంది! మనం తిరిగే రోడ్లని, పరిసరాల్ని శుభ్రంగా ఉంచుకోవడం తెలీడం లేదే? 'పబ్లిక్'అనున్న దేన్నైనా పాడుచేస్తాం. చివరికి మనని మోస్తూ తిరిగే బస్సుల్ని కూడా! సీట్లో కూర్చుని బ్లేడుతో కోసేవాడొకడు, ఎదురుగా సీట్ మీద 'సుజాతా.. ఐ లవ్ యూ' అని గీకేసేవాడొకడు. సుజాత ఆ బస్సెక్కి ఆ సీట్లో కూర్చుని వీడి ప్రేమలేక చదువుతుందా? చదివినా ఎవరు రాసారో తెలుస్తుందా! ఇంకా ముందుకెళితే పబ్లిక్ టాయ్‌లెట్స్‌లో అసభ్యకరమైన రాతలూ, బూతు బొమ్మలూ దర్శనం ఇస్తాయి. మూలలు వెదికితే ఎక్కువ చదువుకోకపోవడమే ఈ అజ్ఞానానికి కారణమా అనిపిస్తుంది. మరైతే పాశ్చాత్య దేశాల్లో అంతా పుట్టుకనుండీ పోస్ట్‌గ్రాడ్యుయేట్లా? చదువుకీ, సంస్కారానికీ ఏమిటి సంబంధం? రోడ్లు ఊడిచే అమ్మాయి ఊడుస్తూనే ఉంటుంది. ధన్ మని ఏ బస్సులోంచో ఖాళీ కోక్ టిన్ రోడ్డు మీదకి విసిరేస్తారు. మన వాకిట్లో కసువు ఊడ్చి బేఫరర్‌గా పక్కింటి గుమ్మ ముందు వదిలేస్తాం. అన్నం పప్పూ, కూరలు మిగిలిపోతే గుమ్మం పక్కన పారేస్తాం. అందుకే పందులూ, ఊరకుక్కలూ మనతో సహచరం చేస్తుంటాయి. రాత్రి పూట దోమలూ, పగలు ఈగలూ మనతో నెయ్యం చేస్తాయి! ఆ కుక్కలు వానాకాలంలో మురికి నీళ్ళు తాగి పిచ్చెక్కి ఏ చిన్నారినో పొట్టన పెట్టుకుంటే మన బల్దియా సిబ్బంది మీద న్యూస్ పేపర్లలో గుండెలు బాదుకుంటూ ఆర్టికల్స్ రాస్తాం. వార్తా ఛానళ్ళు కెమేరామేన్‌లతో హాజరయ్యి ప్రత్యేక కథనాలు అవిశ్రాంతిగా ప్రచారం చేస్తారు!

హెల్మెట్ పెట్టుకోండి తలకాయ పుచ్చకాయలా ముక్కలవదు! అంటే వాడ్ని మాయ చెయ్యడానికి బండి ముందు స్టైలుగా తగిలించుకుని వెళ్ళి చౌరస్తాలో మాత్రం బుర్ర మీద పెట్టుకుంటారు కొందరు! సీట్ బెల్ట్ పెట్టుకోండయ్యా అంటే 'అబ్బే మాకు తోచదండీ' అని తీసిపారేస్తారు. ఏదీ ఈ మాట విమానంలో అనమనండి జబ్బట్టుకుని కిందకి దింపేస్తారు. జీబ్రా క్రాసింగ్ దగ్గర రోడ్డు దాటండి అంటే, అవతలి రోడ్డు మీద పానీ పూరీ బండి వాడూ కనిపించాడని రోడ్డు కడ్డం పడి పరిగెడతారు! జనం ఎక్కువగా ఉన్నప్పుడు "క్యూ" పద్ధతి పాటించండి కాస్త తేలికవుతుంది అంటే, అలాంటప్పుడే మన కండబలం చూపెట్టాలని ఒకరిని ఒకరు తోసుకుంటూ పరిగెడతారు. కుంభమేళాలయినా, సమ్మక్క సారక్క జాతరయినా కుమ్ములాటలో కొందరు అశువులు బాయడం సర్వసాధారణం!

వాళ్ళు స్టాట్యూ ఆఫ్ లిబర్టీని కాపాడుకుంటున్నట్లుగా మనం మన చార్మినార్‌ని కాపాడుకుంటున్నామా? వాళ్ళ గ్రాండ్ కెన్‌యన్‌ని పొగుడుకుంటున్నట్లు, మనం మన తాజ్‌మహల్‌ని ఉంచుకున్నామా? ప్రపంచ వింతల్లో నుండి తీసేస్తాం అంటే రాత్రింబవళ్ళు ఓట్లేయాల్సివచ్చింది!

ఇదంతా భారతీయుల్ని విమర్శించాలని కాదు! మన అందమైన దేశాన్ని కాపాడుకోవాలన్న ఆవేదన. భారతీయుడు నేర్వలేనిది లేదు! అతనికి అక్కర్లేనిది లేదు!

'నాసా'లో కల్పనాచావ్లా స్మృత్యర్థం పాతిన చెట్టు చూస్తే హృదయం భారమైంది. ఒక రత్నాన్ని పోగొట్టుకున్నాం.

మూడు ఆస్కార్లు సాధించిన మన వంగూరివారబ్బాయిని చూస్తే ముచ్చటేసింది! మన సంస్కృతి ఎంత ప్రసిద్ధమైనదో గ్రాండ్ కెన్‌యన్ లో బ్రహ్మ సిస్ట్, విష్ణు సిస్ట్, శివ సిస్ట్‌ని చూస్తే తెలిసింది!

తెలుగువాడు మంచినీరులాంటివాడు. ఏ పాత్రలో పోస్తే ఆ రంగు సంతరించుకోగలడు. ఏదేశం వెళితే ఆ వేషం వెయ్యగలవాడు. ఆ భాష యాస లేకుండా మాట్లాడగలవాడు! వెళ్ళిన సంవత్సరానికే అమెరికా పద్ధతులని వంటపట్టించుకోగలడు. ఫోన్ చేస్తాననడానికి, పిలుస్తాననీ, దూరాన్ని గంటలలో కొలవడానికీ, చీరలు మరిచిపోయి ఫ్యాంటులు వెయ్యడానికీ, ఎంతోకాలం పట్టదు! అలాగే మనవాళ్ళు ఇంట్లో యంత్ర విప్లవం మొదలుపెట్టి పప్పు రుబ్బడానికి మెషిన్, అంట్లు తోమడానికి మిషను, ఇల్లు తుడవడానికి మిషన్, ఒళ్ళు తగ్గడానికి మిషను వాడడం సాధన చేస్తూనే ఉన్నారు. వ్యక్తిగత జీవనంలో ఇన్ని విప్లవాలు చేసినప్పుడు జనసమ్మర్ధంలో ఎందుకు చెయ్యలేమూ? చాతకాకా, రాకా కాదు, శ్రద్ధలేక!

నా మటుకు నాకు హారన్లు లేకుండా, ట్రాఫిక్ జాములు లేకుండా, పరిశుభ్రమైన రోడ్లూ మరుగుదొడ్లూ మెయిన్‌టెయిన్ చేసే ఏ ప్రభుత్వానికయినా ఓటు వెయ్యడానికి అభ్యంతరం లేదు!

కొత్త పార్టీలు మేనిఫెస్టోలో అర్జెంటుగా దీన్ని చేర్చుకుంటే మంచిది! చివరిగా చెప్పేదేమిటంటే... మనదేశ సంస్కృతీ, సంప్రదాయంగూర్చి మిగతా వాళ్ళంతా కుళ్ళుకు చస్తున్నారు! ఇంకా కుళ్ళాలంటే మనం మన తెలుగు తల్లికి మల్లెపూదండతో పాటు శుభ్రమైన చీరను కూడా కట్టాలి!

